దక్షిణ మద్రాసులో వున్న పోరూరులో రాబర్ట్ పయాస్ వుండే యిల్లు ఎల్‌టిటిఈ ఇంటిలిజెన్సుకు ప్రధాన స్థావరం నడిచేది. ఈ పయాస్ జయకుమార్ అనే అతని చెల్లెలు ప్రేమ అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. జయకుమార్ శ్రీలంక వాసి. మొదటిసారిగా 1984లో జాఫ్నానుండి మద్రాసు వచ్చాడు. 1987లో శాంతి అనే భారతీయురాల్ని పెళ్లి చేసుకుని జాఫ్నా తీసుకుని వెళ్లాడు.

జయకుమార్, పయాస్ 1989లో భారతశాంతిదళం శ్రీ లంకలో పోరాడేటప్పుడు వారు ఎల్‌టిటికి సహాయపడ్డారు. శాంతిదళం వారిని కొన్నిరోజుల పాటు నిర్బంధంలో వుంచింది కూడా. ఒక వ్యూహం ప్రకారం 1990 సెప్టెంబరు ప్రాంతంలో జయకుమార్, అతని భార్య శాంతి, పయాస్ రామేశ్వరంకు శరణార్థుల్లా వచ్చారు. అక్కణ్నుంచి వాళ్లను మద్రాసు తీసుకుని వచ్చి యిల్లు ఏర్పాటు చేసినవాడు కళాపతి.


రాబర్ట్ పయాస్

కళాపతి అనేవాడు గతంలో ప్రభాకరన్ అంగరక్షకుడు. 1975లో జాఫ్నా తమిళ మేయర్ ఆల్‌ఫ్రెడ్ దురయప్ప హత్యకేసులో ప్రభాకరన్‌తో బాటు సహనిందితుడు. అతని బావమరిది శరవణన్ ఎల్‌టిటిఈ సానుభూతిపరుడు. అతని సహాయంతో మద్రాసులో పోరూరు, కొడుంగైయూర్‌లలో క్యాంప్‌లు ఏర్పరచి హంతక ముఠాకు ఆశ్రయాలు ఏర్పరచాడు. ఈ క్యాంప్ నిర్వాహకులు హత్యకు ముందు, తర్వాత ఏర్పాట్లు చూశారు. అరివు (ద్రవిడ కళగం కార్యకర్త కొడుకు, బెల్టు బాంబు తయారు చేసినవాడు) యిల్లు కూడా పోరూరులోనే ! అతనికీ, పయాస్‌కీ బాగా స్నేహం కుదిరింది. ఇద్దరూ కలిసి ఎల్‌టిటిఇ ఇంటెలిజెన్సులోకి కార్యకర్తలను చేర్చుకునేవారు.

రాజీవ్ హత్య జరిగాక శివరాజన్ వివరాలు సేకరిస్తూ అతనికి డ్రైవింగ్ లైసెన్సు ఎలా వచ్చింది అని కూపీ లాగడంలో రాబర్ట్ పయాస్ కథ తెలిసింది. ముత్తురాజా జాఫ్నా వెళ్లబోతూ భాగ్యనాథన్‌కి పరిచయం చేసిన నిశాంతన్ (నిక్సన్) ఎల్‌టిటిఈ ఇంటెలిజెన్సులో ముఖ్యమైన వ్యక్తి. పొట్టు ఒమ్మన్‌కు ఆంతరంగికుడు. ఇతను కాంతన్ అనే అతనితో కలిసి వచ్చాడు. ముత్తురాజా భాగ్యనాథన్‌తో "వీళ్లు చాలా ముఖ్యమైన పని మీద వచ్చారు. వీళ్లకి సహాయం చేయండి. ఎల్‌టిటిఈ సానుభూతిపరులకు కూడా వీళ్ల గురించి చెప్పవద్దు" అన్నాడు. వీళ్లు పోరూరు క్యాంప్‌లోనే కళాపతి బావమరిది శరవణన్‌తో కలిసి వుండేవారు.

పోరూరు యింట్లో అనేక మంది ఎల్‌టిటిఇ సానుభూతిపరులు వస్తూ పోతూ వుంటారు కాబట్టి శివరాజన్ తనకంటూ ప్రత్యేకంగా ఒక స్థావరం నడపాలని అనుకున్నాడు. అందువలన పోరూరు వచ్చిన మూడు నెలలకు అంటే 1990 డిసెంబరులో జయకుమార్‌ను వేరే క్యాంప్ నడపమన్నాడు. పోరూరు యింట్లో పయాస్‌ను వదిలేసి జయకుమార్, అతని భార్య అక్కడికి 22 కి.మీ.ల దూరంలో ఉత్తర మద్రాసులోని కొడుంగైయూర్‌లో ప్రాంతంలో ముత్తమిళ్ నగర్‌లో ఓ యిల్లు తీసుకుని అక్కడ రహస్య శిబిరం నడిపారు.


జయకుమార్

జయకుమార్ మావగారు భారతీయుడే కదా, అతని పేర ఆ యిల్లు అద్దెకు తీసుకున్నారు. ఒక కిరాణాషాపు యజమాని వాళ్లకు సహాయపడ్డాడు. తర్వాత లోకం కళ్లు కప్పడానికి, జయకుమార్ ఏదో పని చేస్తున్నట్లు అనిపించడానికి శివరాజన్ అతని చేత కాఫీ పొడరు ఆడించి అమ్మే షాపు పెట్టించాడు. హంతకముఠాలో సభ్యులైనవారిని శివరాజన్ జయకుమార్ యింట్లోనే సమావేశ పరచేవాడు. దీని ఉనికి ఎవరికీ తెలియదు. హత్య జరిగాక పోలీసుల పరిశోధనలో యివన్నీ బయటకు వచ్చాయి. ఈ జయకుమార్‌ని పోలీసులు అరెస్టు చేసి విషయాలన్నీ బయటకు లాగారు. అతను కొంత సమాచారం యిస్తూనే మరి కొంత దాచి పోలీసులను చాలా కన్‌ఫ్యూజ్ చేశాడు.

ఈ క్యాంపులే కాకుండా రహస్యసమాచారం రవాణాకి వీలుగా కొడుంగైయూర్‌లోనే ఎవరెడీ కాలనీలో విజయన్ ఆధ్వర్యంలో మరో ప్రత్యేకశిబిరం ఏర్పాటు చేసింది ఎల్‌టిటిఇ. విజయన్ భాస్కరన్ అనే అతనికి అల్లుడు. ఈ భాస్కరన్ అవడానికి భారతీయుడే అయినా ఎన్నో ఏళ్ల క్రితం శ్రీలంకలో సెటిలయ్యాడు. అతనికి సెల్వలక్ష్మిను విజయన్ పెళ్లాడాడు. అందరూ ఎల్‌టిటిఇ సానుభూతిపరులే. విజయన్ శ్రీలంకలో ఎల్‌టిటిఈ వాహనాలని రిపేరు చేసే మెకానిక్. 1990 సెప్టెంబరులో శివరాజన్ భాస్కరన్‌తో చెప్పాడు – 'నువ్వు, నీ కూతురు, అల్లుడు శ్రీలంక శరణార్థుల వేషంలో యిండియాకు వచ్చి శరణార్థుల శిబిరంలో మకాం చేయండి' అని.

వీళ్లు ఆ ప్రకారంగా 1990 సెప్టెంబరు 12 న రామేశ్వరం చేరి శ్రీలంక శరణార్థులుగా నమోదు చేయించుకున్నారు. తర్వాత రామేశ్వరం నుండి ట్యుటికోరిన్ శరణార్థుల శిబిరానికి మారిపోయారు. అక్కడే ఇండియాలో శివరాజన్ వాళ్లతో 1990 డిసెంబరులో మంతనాలు సాగించాడు. తర్వాత శివరాజన్ ఆదేశాల మేరకు మద్రాసులో తన బంధువుల సహాయంతో కొడుంగైయూర్‌లోని ఎవరెడీ కాలనీలో ఒక యిల్లు అద్దెకు సంపాదించాడు. మే 1991లో రాజీవ్ హత్యకోసం శివరాజన్ తన అనుచరులు శుభ, థాను, తన స్వంత వైర్‌లెస్ ఆపరేటర్ నెహ్రూలతో వచ్చినపుడు వాళ్లను విజయన్ యింట్లో పెట్టాడు. ఈ భాస్కరన్ కూడా పోలీసులకు పట్టుబడడంతో శివరాజన్ విషయాలన్నీ బయటపడ్డాయి.

విజయన్


ఇవికాక ఎల్‌టిటిఇకి చాలా శిబిరాలే వున్నాయి కానీ రాజీవ్ హత్యతో సంబంధం వున్నవాటిల్లో ముఖ్యమైనవి యివి. హత్యకు బ్యాకప్‌గా తయారుచేసుకున్న ఢిల్లీ శిబిరం వంటి వాటి గురించి సందర్భవశంగా చెప్తాను. రాజీవ్ హత్యకు జరిగిన గ్రౌండ్‌వర్క్‌లో భాగంగా యీ శిబిరాల ఏర్పాటు జరిగిందని చెప్పాను కదా. ఇప్పుడు

మరో ముఖ్యమైన పాత్రను ప్రవేశపెడుతున్నాను. ఇతను మురుగన్. నళినితో పాటు జైలులో మగ్గుతున్న యీ మురుగన్ దేవాంతకుడు. అతని కథ వచ్చే సోమవారం. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**